

కంటెయినర్ టెర్మినల్‌లో ప్రమాదం

- లిథియం బ్యాటరీలను లోడ్ చేస్తుండగా ఒక బాక్సుల్ పొగలు
- రజనీకాంత్ సినిమా షూటింగ్‌లో ప్రమాదం జరిగినట్టు వదంతులు

-6వ పేజీలో


ప్రమాదాన్ని అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రుణం పేరుతో వల..



సైబర్ నేరగాళ్ల నయా మోసం

ఫేస్‌బుక్‌లో లోన్ యాప్ నోటిఫికేషన్‌లు

క్లిక్ చేస్తే మోసగాళ్ల వలకు చిక్కినట్టే

రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో మొదట కొద్ది మొత్తం వసూలు

ఆ తర్వాత ఆశల్లో ముంచుతూ విడతల వారీగా అందినంత దోపిడీ

- నగరంలో ఇటీవల పెరుగుతున్న కేసులు
- అన్నీ ఇతర దేశాల నుంచి నిర్వహిస్తున్నవే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మధురవాడ ప్రాంతానికి చెందిన ఒక మహిళకు సెల్ ఫోన్‌లో ఫేస్‌బుక్ చూడడం అలవాటు. ఈనెల 10న ఫేస్‌బుక్ చూస్తుండగా ఇన్‌స్టెంట్ లోన్ అంటూ ఇండియా బుల్స్ పేరుతో ఒక నోటిఫికేషన్ కనిపించింది. దానిపై క్లిక్ చేయగానే రూ.3 లక్షలు వరకూ లోన్ ఇస్తామని ఉండడంతో వివరాలు ఎంటర్ చేశారు. అటు నుంచి బ్యాంకు ప్రతినిధినంటూ ఒకరు ఫోన్ చేసి విడతల వారీగా రూ.96 వేలు వరకూ గుంజేశారు.

రామ్‌నగర్‌కు చెందిన 26 ఏళ్ల స్టాఫ్ నర్సు కొద్దిరోజులు కిందట షటిల్ లోన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లోన్ కోసం అప్లై చేశారు. వెంటనే ఆమెకు ఒకరు కాల్ చేసి లోన్ ఇస్తామని నమ్మించి దశల వారీగా రూ.20 వేలు లాగేశారు. ఇంకా కొన్ని ఫీజులు కట్టాలని కోరడంతో ఆమెకు మోసగాళ్ల పనేనని అర్థం కావడంతో అతని నంబర్‌ను బ్లాక్‌లో పెట్టేశారు.

నగరంలో ఇన్‌స్టెంట్ రుణాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఫేస్‌బుక్‌లో ఇన్‌స్టెంట్ లోన్ యాప్, వెబ్‌సైట్‌ల పేరుతో కొన్ని నోటిఫికేషన్‌లను పెడుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు, వెంటనే రుణం వచ్చేస్తుందని ఆ నోటిఫికేషన్ లింక్‌లను క్లిక్ చేస్తున్నారు. లింక్‌ను క్లిక్ చేయగానే ఫోన్ నంబర్, రాష్ట్రం ఎంటర్ చేయాలని అడుగుతుంది. ఆ మేరకు తమ వివరాలను ఎంటర్ చేస్తున్నారు. ఫోన్ నంబర్ ఎంటర్ చేయగానే సైబర్ నేరగాళ్లు లైన్‌లోకి వచ్చేస్తున్నారు. బాధితులకు ఫోన్ చేసి ఎంత రుణం కావాలని మాటలు మొదలుపెట్టి, వారికి ఆ క్షణంలోనే రుణం మంజూరు చేసేస్తున్నట్టు ఫోన్‌పే నంబర్, బ్యాంకు ఖాతా వివరాలను అడిగి హడావిడి చేస్తున్నారు. ఆ తరువాత లోన్ మంజూరు చేయడానికి ముందు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది కాబట్టి, ఫీజు కింద రూ.2,500 తాము చెప్పే నంబర్‌కు ఫోన్ పే చేయాలని కోరుతున్నారు. రూ.మూడు లక్షలు/రూ.ఐదు లక్షలు రుణం ఇస్తున్నప్పుడు రూ.2,500 కట్టడం పెద్ద లెక్క కాదన్నట్టు సైబర్ నేరగాళ్లు చెప్పిన నంబర్‌కు లోన్ అవసరమైనవారు ఫోన్ పే చేసేస్తున్నారు. తర్వాత మరొకరు ఫోన్ చేసి లోన్ దరఖాస్తు అందిందని, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రుణం కోసం ముందుగా కొంత ఫీజు కడితే, ఆ మొత్తంతోపాటు లోన్ మొత్తం కలిపి తిరిగి అకౌంట్‌కు జమ చేస్తామని నమ్మబలుకుతున్నారు. ఇలా బాధితులు మోసాన్ని గుర్తించేంత వరకూ డబ్బును ఏదో ఒక పేరుతో సైబర్ నేరగాళ్లు లాగేస్తున్నారు. ఈనెల పదిన మధురవాడ ప్రాంతానికి చెందిన ఒక మహిళకు ఇదే తరహా అనుభవం ఎదురైంది. ఫేస్‌బుక్ చూస్తుండగా 'ఇండియా బుల్స్' పేరుతో ఒక ఇన్‌స్టెంట్ లోన్‌కు సంబంధించిన లింక్ కనిపించింది. ఆమె రూ.మూడు లక్షలు రుణం వస్తుందని ఆ లింక్‌ను క్లిక్ చేయగా, ఫోన్ నంబర్‌తోపాటు ఇతర వివరాలను ఎంటర్ చేయాలని కోరారు. ఫోన్ నంబర్ ఇవ్వగానే ఒక వ్యక్తి ఫోన్ చేసి హైదరాబాద్ నుంచి అని చెప్పి తెలుగులోనే మాట్లాడారు. రూ.3 లక్షలు రుణం ఇస్తామని అందుకోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పి రూ.2,500 లాగేశారు. తర్వాత అనుమానం రాకుండా ఉండేందుకు బాధితురాలికి ఆర్‌బీఐ పేరుతో ఉన్న ఒక బాండ్‌ను వాట్సాప్‌కు పంపించారు. దీంతో రుణం వస్తుందనే ఆశతో ఉన్న ఆమె సైబర్ నేరగాళ్లు చెప్పినట్టు విడతల వారీగా రూ.96 వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించారు. ఇంకా అడగడంతో తాను ఇప్పటికే అప్పులు చేసి కట్టానని, ఇక అప్పు ఇచ్చేవారు లేరని చెబుతుండగా పక్కింట్లో ఉండే వ్యక్తి విని...విషయం ఏమిటని ఆరా తీయగా జరిగిన ఉదంతాన్ని చెప్పారు. అదంతా మోసం...అని చెప్పడంతో బాధితురాలు వెంటనే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో నేరగాళ్ల అకౌంట్‌లను ఫ్రీజ్ చేయాలని బ్యాంకు అధికారులకు పోలీసులు మెయిల్ పంపించారు. రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఒక స్టాఫ్ నర్సుకు కూడా ఇదే తరహా అనుభవం ఎదురైంది. అయితే ఆమె ప్రాథమిక దశలోనే మోసాన్ని గుర్తించడంతో తక్కువ నష్టంతో బయటపడ్డారు. ఈ తరహా ఉదంతాలు నగరంలో ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతున్నాయి. చాలామంది అమాయకులు లోన్ యాప్ నిర్వాహకుల ఉచ్చులో చిక్కుకుంటున్నప్పటికీ కొద్దిమంది మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. మిగిలినవారు పరువు పోతుందనే భయంతో ముందుకురావడం లేదని పోలీసులు చెబుతున్నారు.

విదేశాల నుంచే యాప్‌ల నిర్వహణ

ఇన్‌స్టంట్ లోన్‌యాప్‌ల నిర్వాహకులంతా విదేశాల్లో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్నారు. బాధితులకు అనుమానం రాకుండా అన్ని భాషలు మాట్లాడగలిగే వారిని ఉద్యోగాల్లో

... మిగతా 6వ పేజీలో

అవసరమైన రైళ్లు ఇవ్వరా?

ఎవరూ అడగకుండానే దుర్గ్‌కు వందేభారత్ రైలు



- గతంలో పూరీకి వందేభారత్
- బెంగళూరు, తిరుపతి, చెన్నైలకు విశాఖ నుంచి బయలుదేరే (ఒరిజనేటింగ్) రైళ్లు ఏవీ?
- చాలాకాలంగా కేంద్ర మంత్రులు, అధికారులకు విజ్ఞప్తులు
- అయినా పట్టించుకోని వైనం
- ఉత్తరాంధ్ర ఎంపీలు నోరు మెదపరా?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర కేంద్రంగా విరాజిల్లుతున్న విశాఖపట్నం నుంచి ప్రధాన నగరాలకు రైలు సర్వీసులు చాలా తక్కువ. ఎన్నాళ్ల నుంచో అధికారులను, మంత్రులను కొత్త రైళ్లు వేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. కానీ ఎవరూ అడగకుండానే వందే భారత్ రైళ్లను ఎడాపెడా ప్రారంభించేస్తున్నారు.



మొదట విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య వందేభారత్ రైలు ప్రారంభించారు. మరో కొత్త రైలు తక్కువ సమయంలో వెళ్లేది అందుబాటులోకి వచ్చిందని అంతా సంతోషించారు. ఆ తరువాత విశాఖ నుంచి పూరీకి మరో వందేభారత్ రైలు ప్రారంభించారు. దీనిని ఉత్తరాంధ్ర ప్రజలు ఎవరూ కోరుకోలేదు. రైల్వే మంత్రి ఒడిశాకు చెందినవారు కావడంతో ఆ ప్రాంత ప్రజలు త్వరగా విశాఖపట్నం రావడానికి వీలుగా ఈ వందేభారత్ వేసుకున్నారు. ఆ తరువాత విశాఖ-సికింద్రాబాద్‌లకు మంచి డిమాండ్ ఉండడంతో అదనపు వందేభారత్ రైలు ఇచ్చారు. అంతా సంతోషించారు. ఇప్పుడు ఈ నెల 17వ తేదీన అంటే మంగళవారం కొత్తగా మరో వందేభారత్ రైలు విశాఖ నుంచి దుర్గ్‌కు నడుపుతున్నారు. ఇది రాయగడ, టిట్లాఘర్ మీదుగా దుర్గ్ వెళుతుంది. దుర్గ్‌కు వందేభారత్ కావాలని ఉత్తరాంధ్ర ప్రజలు ఎవరినీ అడగలేదు. కానీ అక్కడి వారికి ఉపయోగపడుతుందని దానిని ప్రారంభిస్తున్నారు. కోరకుండా వరాలు ప్రసాదిస్తున్న కేంద్రంలోని పెద్దలు ఎన్నో ఏళ్లుగా అడుగుతున్న రైళ్లను ఎందుకు ఇవ్వడం లేదన్నదే ఇక్కడ పెద్ద ప్రశ్న. ఈ విషయంలో మన ఉత్తరాంధ్ర ఎంపీలు ఎందుకు డిల్లీ పెద్దలను నిలదీయడం లేదో ఎవరికీ తెలియదు. ఇప్పుడు కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వానికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మన అవసరాలు, ప్రజల డిమాండ్లను తెలియజేసి వాటిని సాధించుకోవచ్చు.

బెంగళూరుకు విశాఖ నుంచి రైలు ఏదీ?

ఉత్తరాంధ్రాకు చెందినవారు చాలామంది బెంగళూరులో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారు. తరచుగా రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ విశాఖ నుంచే బెంగళూరు వెళ్లేది. తూర్పు కోస్తా రైల్వే జోన్ పెద్దలు దీనిని భువనేశ్వర్‌కు తీసుకుపోయారు. దాంతో విశాఖ కోటా సీట్లు తగ్గిపోయాయి. బెంగళూరుకు డిమాండ్ ఉండడంతో ప్రత్యేక రైలు నడుపుతున్నారు. అడపాదడపా నడపడం, ఆ తరువాత ఆపేయడం చేస్తున్నారు. దీనిని రెగ్యులర్‌గా నడపాలని చాలాకాలంగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అయినా పట్టించుకోవడం లేదు. విశాఖపట్నం-బెంగళూరు మధ్య ప్రయాణం ఒకరోజు పడుతుంది. ఈ మార్గంలో అత్యంత వేగంగా ప్రయాణించే వందేభారత్ రైలు నడిపితే ఎంతో ప్రయోజనం. దీనిని పట్టించుకోకుండా దుర్గ్‌కు ఎందుకు వేశారో అర్థం కావడం లేదు. ఈసారి విశాఖకు మరో వందేభారత్ అంటే అది బెంగళూరుకు నడిపేలా ఎంపీలు యత్నించాలి.

తిరుపతికి గరీబ్ రథ్ ఎక్కడ?

ఉత్తరాంధ్ర నుంచి ప్రతిరోజూ వేలాది మంది తిరుపతి వెళుతుంటారు. ప్రస్తుతం విశాఖ నుంచి తిరుపతికి తిరుమల ఎక్స్‌ప్రెస్, డబుల్ డెక్కర్ రైలు నడుస్తున్నాయి. వీటిలో మూడు నెలల ముందు బుక్ చేసుకుంటే తప్ప బెర్తులు దొరకవు. ఈ మార్గంలో గరీబ్ రథ్ నడపాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది. దీనిపై అనేకసార్లు రైల్వే అధికారులకు రైల్వే వినియోగదారుల సంఘం వినతిపత్రాలు సమర్పించింది. పట్టించుకోవడం లేదు. వందేభారత్ అయినా నడపొచ్చు. అదీలేదు. విశాఖ నుంచి హైదరాబాద్‌కు ఎంత డిమాండ్‌ఉందో తిరుపతికి కూడా అంతే డిమాండ్ ఉంది. కాబట్టి కొత్త రైలు వేయాల్సిన అవసరం ఉంది.

చెన్నైకి విశాఖ నుంచి రైలే లేదు

ప్రధాన వాణిజ్య కేంద్రమైన చెన్నైకు విశాఖ నుంచి ప్రారంభమయ్యే రైలు ఒక్కటి కూడా లేదు. ఎక్కడెక్కడో బయలుదేరి విశాఖ మీదుగా వెళ్లే కోరమండల్, మెయిల్ వంటి రైళ్లు ఉన్నా వాటిలో అతి తక్కువ సీట్లు విశాఖకు కేటాయిస్తున్నారు. విశాఖ నుంచే ప్రారంభమయ్యేలా ఒక రైలు రెగ్యులర్‌గా నడపాల్సి ఉంది. ప్రతి సోమవారం, శుక్రవారం విశాఖ నుంచి ప్రత్యేక రైలు నడుపుతున్నారు. డిమాండ్ ఉన్న మార్గంలో రెగ్యులర్‌గా రైలు వేయమంటే...వారానికి ఒకరోజో, రెండు రోజులో ప్రత్యేక రైలు నడిపి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత పార్లమెంటు సభ్యులు విశాఖ నుంచి ప్రధాన నగరాలకు కొత్త రైళ్లు వచ్చేలా పనిచేయాల్సి ఉంది.

బొర్రా గుహలకు మహర్దశ

స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.30 కోట్లు మంజూరు

- వీటిలో రూ.24.1 కోట్లతో అభివృద్ధి పనులు
- గుహల్లో సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు
- ప్రయాణ, పార్కింగ్, వసతి సౌకర్యాలు
- నిర్మాణం, నిర్వహణకు ఆర్‌పీఎఫ్ ఆహ్వానం
- ఏడాదిలోగా పనులు పూర్తిచేయాలని నిబంధన


బొర్రా గుహలను ఇలా అభివృద్ధి చేయాలని ప్రణాళిక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన బొర్రా గుహలకు మహర్దశ పట్టనుంది. వీటిని అభివృద్ధి చేయడానికి, పర్యాటకులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.30 కోట్లు మంజూరుచేసింది. వీటిలో రూ. 24.1 కోట్లతో పూర్తిస్థాయిలో వసతులు కల్పించడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆసక్తి వ్యక్తీకరణ కోసం ప్రకటన ఇచ్చింది. ఈ ప్రాజెక్టును నిర్మించి, నిర్వహించడానికి ఐదేళ్ల కాలానికి కాంట్రాక్టు ఇవ్వనుంది. ఇది పూర్తయితే బొర్రా వెళ్లే పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. ప్రయాణం, పర్యటన సౌకర్యవంతంగా ఉంటుంది. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

లక్షల ఏళ్ల చరిత్ర

బొర్రా గుహలు ఈనాటివి కావు. 1500 లక్షల సంవత్సరాల చరిత్ర వాటి సొంతం. ఇవి విశాఖపట్నానికి 90 కి.మీ., ఏజెన్సీలో పర్యాటక కేంద్రమైన అరకులోయకు 38 కి.మీ. దూరంలో ఉన్నాయి. సముద్ర మట్టానికి 1,400 మీటర్ల ఎత్తున ఉన్నాయి. దేశంలోని అతి పెద్ద గుహల్లో ఇవి ఉన్నాయి. వీటిని చూడాలంటే బొర్రా రైల్వే స్టేషన్‌లో దిగి కిలోమీటరు ప్రయాణం చేయాలి. దీని కోసం జీపులు, ఆటోలు ఉంటాయి.

5.89 ఎకరాల్లో అభివృద్ధి పనులు

బొర్రా గుహలకు

... మిగతా 6వ పేజీలో

శ్రీమతికి ఓ ప్రశంస



- భార్యను ప్రశంసించడమూ ముఖ్యమే
- కుటుంబం సాఫీగా సాగడంలో కీలక భూమిక ఆమెదే
- ఉదయం నుంచి రాత్రి వరకూ తీవ్రంగా శ్రమించే వ్యక్తి
- తగిన గుర్తింపు, గౌరవం దక్కకపోవడంతో అనేక ఇబ్బందులు
- నేడు భార్యను ప్రశంసించే రోజు సందర్భంగా...

ఇంటికి దీపం ఇల్లాలు అంటారు. అటువంటి ఇల్లాలి కష్టాన్ని గుర్తించే పనిని అతి తక్కువ మంది మాత్రమే చేస్తుంటారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునేంత వరకు కుటుంబం కోసం అవిశ్రాంతంగా శ్రమించే భార్య చేసే పనిని గుర్తించకపోవడం వల్ల అనేక కుటుంబాల్లో వివాదాలు తలెత్తుతున్నాయి. కొంతమంది మహిళలు మానసికంగా తీవ్ర వేదనకు, ఒత్తిడికి గురై అనారోగ్యానికి గురవుతున్నారని పలు పరిశోధనలు చెబుతున్నాయి. కుటుంబ నావను సాఫీగా నడిపించడంలో కీలకంగా వ్యవహరించే భార్యను గుర్తించడం, గౌరవించడం ద్వారా ఆనందకరమైన జీవితాన్ని సాగించేందుకు అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఉద్దేశంతోనే ఏటా సెప్టెంబరు మూడో ఆదివారం భార్యను ప్రశంసించే రోజుగా నిర్వహిస్తూ వస్తున్నారు. గడిచిన కొన్నాళ్లుగా ఈ రోజును ప్రపంచంలోని అనేక దేశాల్లో నిర్వహిస్తున్నప్పటికీ..చాలా మందికి దీనిపై అవగాహన కూడా లేదు. నేడు భార్యను ప్రశంసించే (అభినందించే) రోజు సందర్భంగా అందిస్తున్న ప్రత్యేక కథనం...

- మెయిన్ 2లో..

స్టీల్‌ప్లాంటు పరిరక్షణే ధ్యేయం

విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటన

- ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేంత వరకూ కార్మికుల పోరాటాలకు అండగా ఉంటాం
- ఉక్కు కర్మాగారాన్ని లాభాల్లోకి తేవడమే అందరి లక్ష్యం కావాలి
- స్టీలుప్లాంటును పరిరక్షించలేకపోతే రాజీనామా చేసి, కార్మికులతో పోరాటంలో పాల్గొంటానన్న పల్లా
- రిలే దీక్షల శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం


కూర్మన్నపాలెం రిలే నిరాహార దీక్షల శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ ఎం.శ్రీభరత్. చిత్రంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జీ, తదితరులు ఉన్నారు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 14:

ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ కార్మికులు చేపట్టే పోరాటాలకు అండగా ఉంటామని విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1311 రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని శనివారం వారు సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉక్కు కార్మికులను ఉద్దేశించి శ్రీభరత్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో పూర్తిస్థాయి ఉత్పత్తి జరిగేందుకు అవసరమైన నిర్ణయాలను కేంద్రం తీసుకునే విధంగా కృషిచేస్తానన్నారు. ఉత్పత్తి తగ్గడం, ఆర్థిక భారం ఎక్కువ కావడం, బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూతపడడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని, వారికి భరోసా కల్పించాలనే తాను వచ్చానన్నారు. మూడు నెలలుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ఉక్కు మంత్రి, ఇతర కేంద్ర మంత్రుల మధ్య చర్చలు జరుగుతున్నాయని, వాటి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. కేంద్ర ఉక్కు మంత్రి ఆది నుంచి ఉక్కు పరిరక్షణకు కృషిచేస్తానని హామీ ఇస్తున్నారన్నారు. ఉక్కు పరిరక్షణే అందరి ఏకైక ధ్యేయమన్నారు. ఉక్కు కర్మాగారాన్ని లాభాల్లోకి తేవడమే మన లక్ష్యమన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ తొలి నుంచి తాను చెప్పే మాట ఒకటేనని, విశాఖ స్టీలుప్లాంటును పరిరక్షించకపోతే రాజీనామా చేసి, ఉక్కు కార్మికులతో పోరాటాల్లో పాల్గొంటానన్నారు. కార్మికులు, నిర్వాసితులు ఆందోళన చెందవద్దన్నారు. కార్మికుల పట్ల ఉక్కు యాజమాన్యం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలనూ, కర్మాగారం ఈ స్థితికి రావడానికి దారితీసిన

... మిగతా 6వ పేజీలో

ఇకపై ఒక్కరే ఎంఈవో?

ప్రభుత్వ నిర్ణయం...జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం

- గత ప్రభుత్వం తీసుకువచ్చిన మండలానికి ఇద్దరు ఎంఈవోల విధానానికి స్వస్తి
- స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):

మండలానికి ఇద్దరు విద్యాశాఖాధికారుల విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకనున్నట్టు తెలిసింది. గతంలో మాదిరిగా ఎంఈవో ఒక్కరే ఉంటారు. అయితే పాఠశాలల్లో విద్యా బోధనను పర్యవేక్షించడానికి స్కూల్ కాంప్లెక్స్‌ల వ్యవస్థను పటిష్టం చేసి, అక్కడ హెచ్‌ఎంకు కీలక బాధ్యతలు అప్పగించనున్నారు.


మండలంలో పాఠశాలల పర్యవేక్షణ కంటే ఇరువురు ఎంఈవోల మధ్య ఆధిపత్య పోరే ఎక్కువగా ఉండేది. ప్రైవేటు స్కూళ్లు ఎక్కువగా ఉన్న విశా

గతంలో మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. విద్యాబోధన, టీచర్ల సర్వీస్ వ్యవహారాలు, ప్రభుత్వ పథకాలు అమలు తీరును పర్యవేక్షించేవారు. అయితే ఎంఈవోకు పనిభారం ఎక్కువగా ఉందని భావించిన గత పాలకులు ప్రతి మండలానికి రెండో ఎంఈవో పోస్టును కేటాయించారు. ఎంఈవో-1గా ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు, ఎంఈవో-2గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలలో సీనియర్లకు అవకాశం కల్పించారు. విశాఖ జిల్లాలో వాటి గుర్తింపు వ్యవహారంలో ఎంఈవోల మధ్య కొన్నాళ్లు ప్రచ్ఛన్న యుద్ధం జరిగింది. చివరకు కొంతమంది చొరవతో ప్రైవేటు పాఠశాలలను ఇద్దరు చెరో సగం పంచుకుని భారీగా వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇద్దరు ఎంఈవోల మధ్య వివాదాలు ఎక్కువగా ఉండడంతో కొత్త ప్రభుత్వం మండలానికి ఒకరిని మాత్రమే ఉంచాలని సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చింది. ఇప్పటికే ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం వచ్చింది. ఒక్క ఎంఈవోనే కొనసాగించనున్న నేపథ్యంలో విద్యా బోధన, పాఠశాలలపై పర్యవేక్షణ బాధ్యత స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అప్పగించనున్నారు.

విశాఖ జిల్లాలో 543 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 54 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. రమారమి పది వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అందుబాటులో ఉంటూ అన్ని సదుపాయాలున్న ఉన్నత పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్‌గా పరిగణిస్తుంటారు. తాజా నిర్ణయంతో స్కూల్ కాంప్లెక్స్‌ల సంఖ్య స్వల్పంగా తగ్గుతుందని

... మిగతా 6వ పేజీలో





ఏయూలో కంటైనర్ దుకాణాల ఏర్పాటుపై ఫిర్యాదులు

▸▸ తొలగింపునకు సిద్ధమైన అధికారులు ▸▸ ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు ▸▸ తుది నిర్ణయానికి కమిటీ ఏర్పాటు

విశాఖపట్నం,సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీలోని అనేక చోట్ల కంటైనర్ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు గత పాలకులు అనుమతి ఇచ్చారు. వీటిని స్టార్టప్‌లుగా పరిగణించారు. వీటికి సంబంధించిన అద్దె, ఇతర మొత్తాలను కూడా వర్సిటీ రిజిస్ట్రార్, ఉన్నతాధికారులకు కాకుండా ఆ హబ్‌లోని అధికారులకు చెల్లిస్తున్నట్టు చెబుతున్నారు. అయితే, దీనిపై కొద్దిరోజుల నుంచి వర్సిటీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ వ్యవహారం మరింత ముదురుతుండడంతో అప్రమత్తమైన అధికారులు వర్సిటీలోని 12 చోట్ల ఏర్పాటు చేసిన కంటైనర్ దుకాణాలు తొలగించేందుకు సిద్ధమయ్యారు.

అయితే, ఆయా దుకాణాలకు సంబంధించిన యజమానులు (స్టార్టప్ నిర్వాహకులు అని చెబుతున్నారు) ఉన్నతస్థాయిలో సిఫార్సులు చేయిస్తున్నారు. దీంతో వాటిని తొలగించడం అధికారులకు ఇబ్బందిగా మారింది. వీటివల్ల అనేక చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నట్టు పలువురు వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఒత్తిళ్ల వల్ల తొలగించకుండా ఉండడం కూడా ఇబ్బందిగా మారుతుందని భావించిన అధికారులు.. వీటిని కొనసాగించాలా..? తొలగించాలా..? అన్న విషయాలను తేల్చేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. రెండు, మూడు రోజుల్లో కమిటీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. వర్సిటీలోని ప్రధాన క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి కొద్దిరోజుల్లో టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. క్యాంటీన్ కొనసాగింపునకు సంబంధించి ప్రస్తుతం కోర్టులో కేసు ఉంది.

చవితి ఉత్సవాల నిర్వహణ అభినందనీయం


వృద్ధురాలికి దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమా శ్రీధర్


ఆదిత్య గణపతి అలంకారంలో దుర్గాగణపతి

డాబాగార్డెన్స్/పూర్ణామార్కెట్ సెప్టెంబరు 14: వినాయక చవితి మహోత్సవాలను వివిధ కమిటీల సభ్యులు సుహృద్భావ వాతావరణంలో చేపట్టడం ఆనందదాయకమని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో పూర్ణామార్కెట్ వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆశ్రమంలోని వృద్ధులకు చీరలు, రాత్రి దుస్తులు, పండ్లు అందజేశారు.

అక్కయ్యపాలెం: తాటిచెట్లపాలెంలోని శ్రీసాక్షి మహాగణపతి ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రైల్వే న్యూకాలనీలోని శ్రీసాయి నిలయం ఫ్లాట్ ఓనర్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జ్ఞానాపురం: జ్ఞానాపురంలో బ్లడ్‌లైన్ బాయ్స్, జీఎఫ్ఏ బాయ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ హాజరై అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. దీంతోపాటు శనివారం జ్ఞానాపురంలో జరిగిన అన్నదాన కార్యక్రమాలకు రూ.40 వేల విరాళం అందించారు.

అశ్వరథ వాహనంపై దుర్గాగణపతి

సీతంపేట: సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో ఈఓ రమాబాయి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆదిత్య గణపతి అవతారంలో సుందరంగా అలంకరించారు. అశ్వరథంపై స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ముఖ్యం

▸▸ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మంజుల

విశాఖపట్నం, సెప్టెంబరు 14: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో స్వస్థ్ మహిళ, స్వస్థ్ భారత్ కార్యక్రమం జరిగింది. హెల్త్ క్లబ్, యువీకెన్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించి, వైద్యుల పర్యవేక్షణలో స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినులకు స్ర్కీనింగ్ పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల హాజరై స్వస్థ్ మహిళ, స్వస్థ్ భారత్ ప్రాధాన్యం తెలుపుతూ మహిళలు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పొంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ క్లబ్ కన్వీనర్ ఎ.జ్యోతి, యువీకెన్ ఫౌండేషన్ డాక్టర్ మాధురి, డాక్టర్ సాయి చరిత, తేజస్వి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లకు సెలవుపై ఎమ్మెల్యే హామీ


ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సీతమ్మధార, సెప్టెంబరు 14: రైతులకు, రైతు బజార్లకు వారంలో ఓ రోజు ఇస్తున్న సెలవును యథాతథంగా కొనసాగించాలని రైతులు ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు విష్ణుకుమార్ రాజును కలిసి విజ్ఞప్తి చేశారు. రైతులకు వారంలో ఇస్తున్న ఒక్క రోజు సెలవును సీతమ్మధార, కంచరపాలెం, ఎంవీపీ కాలనీ, అక్కయ్యపాలెం నరసింహనగర్ రైతు బజార్లకు రద్దు చేస్తూ జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రైతులు తమకు సెలవు కావాలంటూ విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రాన్ని సమర్పించారు. సెలవు కొనసాగించేలా అధికారులతో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా ఎమ్మెల్యే కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక తదితరులు పాల్గొన్నారు.

11 మంది ఎస్ఐల బదిలీ

మహారాణిపేట, సెప్టెంబరు 14: విశాఖ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పలువురు పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి. కె.సురేష్‌కుమార్ (త్రీటౌన్) డి.వరలక్ష్మి (స్టీల్ ప్లాంట్ ట్రాఫిక్), కోమరా శ్రీనివాసరావు (వన్‌టౌన్ ట్రాఫిక్), సీహెచ్ సూర్యనారాయణ (పద్మనాభం), కె.భాస్కర్‌రావు (పీఎంపాలెం), ఎస్.గౌరి (భీమిలి), సీహెచ్ స్వామినాయుడు(పెందుర్తి), ఎస్.సురేష్ (ఎయిర్ పోర్టు), ఎస్.క్రిష్ణవర్మ (గాజువాక ట్రాఫిక్), ఎల్. శ్రీనివాసరావు (దువ్వాడ), ఎం.రాధాకృష్ణ గాజువాక పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

కనక మహాలక్ష్మికి స్వర్ణ కవచాలంకరణ



జగదాంబ కూడలి, సెప్టెంబరు 14: వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణ కవచాలంకరణతో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక శోభతో దర్శనమిచ్చిన అమ్మవారిని చూసి భక్తులు తన్మయులయ్యారు. అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. పవిత్రోత్సవ పూజల్లో భాగంగా రెండో రోజు వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య పూజల్లో భాగంగా తులసీదళార్చన సేవల్లో ఉభయదాతలతో అర్చకులు పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి, జేఈవో వి.రాంబాబు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో లక్ష్మీ సహస్రకు అవార్డు


అవార్డు అందచేస్తున్న నిఖిల్ బాబ్ లాడి

సీతమ్మధార, సెప్టెంబరు 14: టొయోట సంస్థ 15 సంవత్సరాలలోపు విద్యార్థులకు నిర్వహించిన డ్రీమ్ కార్ చిత్ర లేఖన పోటీల్లో శ్రీప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థిని బహుమతి గెలుచుకుంది. ఈ పోటీల్లో 90 దేశాల నుంచి 7.12 లక్షల మంది విద్యార్థులు పాల్గొనగా 26 మంది తుది జాబితాకు ఎంపికయ్యారు. అందులో భారత దేశంలోనే ఉత్తమ అవార్డును విశాఖపట్నం శ్రీప్రకాష్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని పి.లక్ష్మి సహస్ర కైవసం చేసుకుంది. లక్ష్మి సహస్రకు టొయోట కిర్లస్కార్ మోటార్స్ ఆంధ్ర స్టేట్ హెడ్ నిఖిల్ బాబ్ లాడి రూ.3 లక్షల నగదు బహుమతిని, ట్రోఫీని అందజేశారు. ఇదే విద్యాసంస్థకు చెందిన మరో 13 మంది విద్యార్థులకు కూడా నగదు బహుమతులిచ్చారు. విజేతలను విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాష్ అభినందించారు.

రుణం పేరుతో వల..

... 5వ పేజీ తరువాయి

పెట్టుకోవడం, ఏజెంట్ల ద్వారా అన్ని రాష్ట్రాలకు చెందిన సిమ్ కార్డులను సంపాదించడం చేస్తున్నారు. ఏ రాష్ట్రానికి చెందిన వ్యక్తికి ఆ రాష్ట్రానికి చెందిన సిమ్ కార్డు నుంచి ఫోన్ చేసి, ఆ రాష్ట్ర భాషలో మాట్లాడిస్తారు. కాంబోడియా నుంచి ఇదే తరహా మోసాలకు పాల్పడే ముఠా చేతిలో చిక్కుకున్న ఏపీ, తెలంగాణకు చెందిన వందలాది మందిని నగర పోలీసులు ఇటీవల విడిపించి తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

బొర్రా గుహలకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి



రోజూ వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. కానీ వారికి సరైన ప్రయాణ, పార్కింగ్, వసతి సౌకర్యాలు లేవు. ఈ నేపథ్యంలో 5.89 ఎకరాల్లో రూ.24 కోట్లతో సౌకర్యాలు సమకూర్చాలని ఏపీటీడీసీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో అచ్చంగా రెండు ఎకరాల స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించారు. అలాగే బొర్రా గుహలకు వెళ్లే మార్గంలో అందమైన ద్వారం, గుహల వద్ద మరో ద్వారం నిర్మిస్తారు. ఆ ప్రాంతం వాహనాల పొగతో కాలుష్యమయం కాకుండా ఎలక్ట్రిక్ వాహనాలను నడుపుతారు. వాటి ద్వారా పర్యాటకులను గుహలకు తీసుకువెళ్లి తీసుకువస్తారు. పర్యాటకుల కోసం టాయిలెట్లు, లగేజీ భద్రపరుచుకునే గదులు, తాగునీటి సౌకర్యం కల్పిస్తారు.

ప్రత్యేకంగా మార్కెట్ స్ట్రీట్

బొర్రా గుహల ముందు గిరిజనులు తయారుచేసిన, పండించిన వాటిని విక్రయిస్తున్నారు. దీనిని మార్కెట్ స్ట్రీట్‌గా అభివృద్ధి చేస్తారు. రెండు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. పర్యాటకులు పక్కనే ఉన్న లోయ అందాలను తిలకించేందుకు వ్యూపాయింట్లు, విజువల్ డెక్ ఏర్పాటుచేస్తారు. సిటింగ్ ఏరియా ఉంటుంది. అడ్వంచర్ స్పోర్ట్స్, ఎగ్జిబిషన్ వంటివి పెడతారు.

విజిటర్స్ కౌంటర్

పర్యాటకుల వసతి కోసం రెండు అంతస్థుల భవనం నిర్మిస్తారు. ఇక్కడే టికెట్లు, బ్యాగేజీ, రెస్టారెంట్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఇక గుహల లోపల అవసరమైన ప్రాంతాల్లో స్టెయిర్ కేసులు, రెయిలింగ్‌లు పెడతారు. కొత్తగా విద్యుద్దీపాలు అమరుస్తారు. సీసీ టీవీ కెమెరాలు వంటివి ఉంటాయి.

సౌండ్ అండ్ లైటింగ్ షో

గుహ లోపలి అందాలను విభిన్న కోణాల్లో చూపించడానికి సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటుచేస్తారు. దాంతో కళ్ల ముందు రంగుల ప్రపంచం ఆవిష్కృతమవుతుంది. ఇది మరిచిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. ఈ ప్రాజెక్టుకు టెండర్లు సమర్పించడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఇచ్చినట్టు పర్యాటక శాఖ ప్రాంతీయ డైరెక్టర్ శ్రీనివాస పాణి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణే ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

పరిస్థితులను ప్రజా ప్రతినిధులకు కార్మికులు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, నాయకులు నల్లారు సూర్యనారాయణ, ప్రసాదుల శ్రీనివాస్, ఉక్కు పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు, కేఎస్ఎన్ రావు, విల్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 6న జూ మారథాన్

మహారాణిపేట, సెప్టెంబరు 14: వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 6న వైజాగ్ జూ మారథాన్ 3వ ఎడిషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నిర్వాహకులు డాక్టర్ కృష్ణచైతన్య తెలిపారు. శనివారం బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మారథాన్‌కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. అక్టోబరు 6న ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు నుంచి మారథాన్ ప్రారంభమవుతుందని, ఇందులో 21 కె, 10 కె, 5 కె, 3 కె పేరిట పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు రూ.3 లక్షల నగదు పారితోషికం ఉంటుందని తెలిపారు. ముందుగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అసోసియేషన్ సభ్యులు యోగేష్, రవి, శ్రీరామ్, యశ్వంత్ పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన గంజాయి నిందితుడు

విశాఖపట్నం, సెప్టెంబరు 14: రైల్వే స్టేషన్‌లో గంజాయి తరలించేందుకు యత్నిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన సదిరి సత్తిబాబు గంజాయి రవాణాకు రెక్కీ నిర్వహిస్తుండగా గమనించి అదుపులోకి తీసుకున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. నిందితుని విచారించిన అనంతరం కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని పేర్కొన్నారు.రైల్వే స్టేషన్‌లో నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, గంజాయి రవాణాతోపాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై నిఘా ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు.


'డిమాండ్ల సాధనలో ఐసీఈయూ కీలకం'


వేదికపై ఐసీఈయూ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 14: ఎల్ఐసీ ఉద్యోగుల డిమాండ్ల సాధనలో ప్రభుత్వ రంగంలో ఎల్ఐసీ పరిరక్షణ, కార్మికవర్గ పోరాటాల సాధనలో ఐసీఈయూ కీలక పాత్ర పోషించిందని విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ అన్నారు. శనివారం ఎల్ఐసీ భవన్‌లోని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ గోల్డెన్ జూబ్లీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులకు ట్రేడ్ యూనియన్ విద్య క్లెయిమ్‌ల పరిష్కారం, బడ్జెట్-2024 వంటి విభిన్న సమకాలీన అంశాలపై అనేక సదస్సులు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఐఆర్‌డీఏ ప్రతిపాదనలు మొదలైన అనేక కార్యకలాపాలతో గోల్డెన్ జూబ్లీ సంవత్సరం జరుపుకొన్నామన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా పేద పిల్లలకు పుస్తకాల పంపిణీ, గిరిజన హాస్టళ్లలో వైద్య శిబిరం కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఛైర్‌పర్సన్ ఎన్.కృష్ణమూర్తి, అధ్యక్షురాలు ఎం.కామేశ్వరి, బి.శ్రీనివాసరావు, తిరుమలరావు, రవీంద్రనాథ్ ఠాగూర్, జి.ఎల్.ప్రసన్న, మీడియా ఇన్‌చార్జ్ ఎ.రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

స్వయం నిర్ణయాలతోనే మహిళా సాధికారత

▸▸ స్వాగత వేడుకల్లో న్యాయ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సుమిత్రా శ్రీపాద


స్వాగత వేడుకల్లో జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 14: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం 67వ స్టూడెంట్ కౌన్సిల్ ఫ్రెషర్స్ డే (స్వాగత) వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. నూతన విద్యార్థులను స్వాగతిస్తూ ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తెలిపారు. ఈ వేడుకల ప్రారంభానికి ముఖ్యఅతిథిగా డా.బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుమిత్రా శ్రీపాద హాజరయ్యారు. ఆమె సైబర్ క్రైమ్, గృహహింస చట్టంపై అవగాహన కల్పిస్తూ మహిళల్లో స్వయం నిర్ణయాత్మక శక్తి పెరిగినప్పుడే సాధికారిత పొందినట్లని ఉద్బోటించారు. అనంతరం విద్యార్థులు చక్కని శాస్త్రీయ, పాశ్చాత్య, జానపద నృత్యాలు, పాటలు, మూకాభినయంతో ఆహూతులను అలరించారు. మిస్ ఫ్రెషర్ విభాగంలో డిగ్రీలో సాయి ప్రణతి, వైష్ణవి, ఇంటర్మీడియట్‌లో పల్లవి, కీర్తన విజేతలుగా నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్ కిరీటాలు తొడిగి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సలహాదారులు డాక్టర్ హరిణి, పావని, ప్రమీల, సిస్టర్ దిపాలి, డాక్టర్ రమణీలత, డాక్టర్ పవన్, డా.పి.కె.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కంటెయినర్ టెర్మినల్‌లో ప్రమాదం

▸▸ లిథియం బ్యాటరీలను లోడ్ చేస్తుండగా ఒక బాక్సులో పొగలు
▸▸ రజనీకాంత్ సినిమా షూటింగ్‌లో ప్రమాదం జరిగినట్టు వదంతులు

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్ పక్కనే ఉన్న విశాఖ కంటెయినర్ టెర్మినల్‌లో శనివారం స్వల్ప ప్రమాదం జరిగింది. లిథియం బ్యాటరీలను కంటెయినర్‌లోకి ఎక్కిస్తుండగా ఒక బాక్సులో పొగలు వచ్చాయి. వెంటనే పోర్టు అగ్నిమాపక శకటాన్ని రప్పించి పొగలను ఆర్పివేశారు. ఈ బ్యాటరీలు చైనా నుంచి ఆగస్టు 28న ఇక్కడకు వచ్చాయి. వాటిని కోల్‌కతా పంపేందుకు ఇప్పుడు లోడింగ్ చేస్తుండగా స్వల్ప ప్రమాదం జరిగింది. ఈ విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విశాఖ కలెక్టర్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకుంది. అయితే అక్కడ సినిమా హీరో రజనీకాంత్ షూటింగ్ జరుగుతుండగా ఈ ప్రమాదం జరిగిందని వదంతులు రావడంతో జిల్లా అధికారులు పూర్తి వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి నష్టంజరగలేదని పేర్కొన్నారు.

ఇకపై ఒక్కరే ఎంఈవో?

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. మారుమూల ప్రాంతంలో ఉన్న స్కూల్ కాంప్లెక్స్ బాధ్యత అందుబాటులో ఉన్న ఉన్నత పాఠశాలకు అప్పగించనున్నారు. ప్రధానోపాధ్యాయ పోస్టు లేని బోని స్కూలు కాంప్లెక్స్‌ను గొట్టిపల్లిలో, గండిగుండంను గిడిజాలలో కలుపుతున్నారు. స్కూలు కాంప్లెక్స్ పరిధిలో 35 నుంచి 87 ఎస్జీటీ టీచర్లు ఉండేలా మార్పులు చేస్తున్నారు. తాజా నిర్ణయంతో స్కూలు కాంప్లెక్స్ హెచ్ఎంలకు ఎక్కువ అధికారాలు అప్పగిస్తున్నారు. ఎస్జీటీలకు సంబంధించి సర్వీస్ వ్యవహారాలు, సెలవులు మంజూరు అధికారాలు కట్టబెడతారు. ఇక ఎంఈవోలను పాఠశాలల తనిఖీ బాధ్యతల వరకే పరిమితం చేయనున్నారు.

వరద బాధితులకు అండగా ర్యాలీ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 14: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిల స్ఫూర్తితో విద్యార్థులు, నిరుద్యోగ యువతతో కలసి వరద బాధిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలు చేపడతామని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ తెలిపారు. సహాయం చేసేందుకు సేవాభావం గలవారు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శనివారం నరసింహనగర్‌లో 'మానవసేవయే మాధవసేవ' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. గొప్ప ప్రకాశ్, జి.రంగారావు, జి.రఘుబాబు, ఐ.ప్రియాంక, పీలా సుమన్ తదితరులు పాల్గొన్నారు.













గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు.. పక్కన రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన నీరు

మేహాద్రిగెడ్డ నుంచి నీరు విడుదల

ఒక గేటు ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు

గోపాలపట్నం, సెప్టెంబరు 14: ఇటీవల కురిసిన వర్షాలకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో ఒక గేటు ఎత్తి నీటిని శనివారం విడిచిపెట్టారు. రిజర్వాయర్ నీటి సామర్థ్యం 61 అడుగులు కాగా, వారం క్రితమే నీటిమట్టం 59.3 అడుగులకు చేరింది. కాగా ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు కొద్దికొద్దిగా చేరడంతో శనివారం ఉదయానికి రిజర్వాయర్ నీటిమట్టం 59.7 అడుగులకు చేరింది. దీంతో శనివారం ఉదయం రిజర్వాయర్‌ను నీటిపారుదలశాఖ ఈఈ త్రినాథ్, ఏఈ పి.నళిని, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు పరిశీలించారు. అనంతరం గంగమ్మకు పూజలు చేసి రిజర్వాయర్ 3వ నంబర్ గేటును మూడు అంగుళాల మేర ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్ నీటిమట్టం 59.5 అడుగులకు దిగువకు చేరాక గేటును మూసివేస్తామన్నారు.

రహదారిపై మురుగు ప్రవాహం

ఆటోనగర్-కుంచుమాంబ కాలనీ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు

దోమల విజృంభణతో జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికుల ఆవేదన





ఆటోనగర్ ప్రధాన రహదారి పక్కన పూడికలతో నిండిపోయిన మురుగు కాలువ. (ఇన్‌సెట్లో) ఆటోనగర్ నుంచి కుంచుమాంబ కాలనీకి వెళ్లే రోడ్డులో పారుతున్న మురుగు నీరు

ఆటోనగర్, సెప్టెంబరు 14: జీవీఎంసీ 71వ వార్డు పరిధి ఆటోనగర్‌లో మురుగు కాలువ పూడికలతో నిండిపోవడంతో నీరంతా రహదారిపై ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. మురుగు నీరంతా రహదారిపై పెద్దఎత్తున పారుతుండడంతో ఆటోనగర్ నుంచి కుంచుమాంబ కాలనీ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భరించరాని దుర్వాసనతో ముక్కు మూసుకుని ఈ రోడ్డులో రాకపోకలు సాగించాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మురుగు కాలువ పూడికలతో నిండిపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని వాపోతున్నారు. మురుగు నీటి వల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడి కాలువలోని పూడికలను తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మహిళా సాధికారతతోనే దేశం ముందడుగు: ఎమ్మెల్యే 'గంటా'

విశాఖపట్నం, సెప్టెంబరు 14: ఉన్నతాశయంతో మహిళలు నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో మహవీర్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవ్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే దేశం ముందడుగు వేస్తుందన్నారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రియదర్శిని ఓల్డేజ్ హోం పునర్నిర్మాణానికి ఇవ్వాలన్న ఆలోచన అభినందనీయమన్నారు. 260 మంది మహిళలు సభ్యులుగా ఉన్న ట్రస్ట్ ప్రతి ఏడాది నిర్వహించే ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని దాతృత్వ కార్యక్రమాలకు వినియోగించడం ప్రశంసనీయమని కొనియాడారు. ట్రస్ట్ ఛైర్‌పర్సన్ సునీత రెకేచ, కార్యదర్శి దివ్య లల్వాని, ఫ్యాన్సీజైన్, నిర్మల హిరావత్, సుబోధ్ రెకేచ, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వసతిగృహ ఉద్యోగుల సస్పెన్షన్

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వసతిగృహంలో ఉంటున్న విద్యార్థులతో మరుగు దొడ్లను శుభ్రం చేయించిన వ్యవహారంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చర్యలు తీసుకున్నారు. నగర పరిధిలోని సీతమ్మధారలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులతో హాస్టల్ అధికారులు మరుగుదొడ్లను శుభ్రం చేయించారు. దీనిపై ఈనెల 9న విద్యార్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారించిన ఆయన వాస్తవమని తేలడంతో హాస్టల్ సంక్షేమ అధికారి ప్రసాదరావును సస్పెండ్ చేయడంతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగి ఎం. అప్పారావును విధుల నుంచి తొలగిస్తూ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

'ఉక్కు'లో స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞ

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 14: స్టీల్‌ప్లాంట్‌లో స్వచ్ఛతా హి సేవా-2024 వారోత్సవాల ప్రతిజ్ఞను శనివారం ఉక్కు పరిపాలన భవనంలో నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు ఎస్‌సీ పాండే, గణేశ్, సీవీవో ఎస్.కరుణరాజులు ఉన్నతాధికారులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతో పరిశుభ్రత డ్రైవ్‌లు, భద్రత-సురక్ష వంటి అంశాలపై చర్యలు తీసుకుంటామన్నారు. వారోత్సవాల్లో ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అగనంపూడి, సెప్టెంబరు 14: జీవీఎంసీ 79వ వార్డు పరిధి గల్లవానిపాలెంలో లయన్స్ క్లబ్, ముత్యాల హారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ ప్రతినిధి కె.హనుమంతరావు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండున్నర వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 34, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 38, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయ 40, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 22, క్యారేట్ 35, దొండకాయలు 34, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 42, ముల్లంగి 34, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 40, వెల్లుల్లి (పెద్దవి) 280, దోసకాయలు 30, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 54, దేముడుచిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	97
ఫారం ధర	--	117
విత్ స్కిన్	--	204
స్కిన్‌లెస్	--	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 2లో..

రేపటి నుంచి హెచ్‌పీసీఎల్‌లో షట్‌డౌన్ పనులు



మల్కాపురం, సెప్టెంబరు 14: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లో సోమవారం నుంచి షట్‌డౌన్ పనులు ప్రారంభం కానున్నాయి. ఎఫ్‌సీసీ-1, పీఆర్‌యూ, మెరాక్స్-2 యూనిట్లను షెట్‌డౌన్ చేసి శుద్ధి చేసేందుకు సుమారు రూ.20 కోట్లను యాజమాన్యం వెచ్చించనున్నది. ఇప్పటికే ఆయా యూనిట్లలో చమురు శుద్ధి చేసే పనులు నిలిపివేసి, ప్లాంట్లను కూల్ చేసే పనులు చేపట్టారు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో కూల్ అయిన తర్వాత యూనిట్లను శుభ్రం చేసే పనులను సంబంధిత కాంట్రాక్టర్లు ప్రారంభిస్తారు. కాగా ఈ మూడు యూనిట్లలో షట్‌డౌన్ పనులకు సుమారు రెండు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు సిద్ధమయ్యారు. వీరంతా కంపెనీలోకి వెళ్లేందుకు పాస్‌లు జారీ చేస్తున్నారు. అయితే ఈ పనుల సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. కానీ కార్మికులకు సేఫ్టీ బెల్ట్‌లు, చైన్ బ్లాక్‌లు, ఇతరాత్ర పరికరాలను నాణ్యత లేనివి సరఫరా చేస్తుండడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వంద సెఫ్టీ బెల్ట్‌లు అవసరమని కంపెనీ కోరగా, పది బెల్ట్‌లతో పనులకు కాంట్రాక్టర్లు సిద్ధమవుతున్నారు. లెక్కల్లో మాత్రం శత శాతం చూపుతున్నట్టు తెలిసింది. షట్‌డౌన్ పనుల సమయంలో సెఫ్టీ బాధ్యతను థర్డ్ పార్టీ సేఫ్టీ అధికారులకు హెచ్‌పీసీఎల్ యాజమాన్యం అప్పగించింది. ఈ అధికారులు నాసిరకం బెల్ట్‌లకు కూడా నాణ్యమైనవంటూ స్టిక్కర్లు వేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. యూనిట్ల షట్‌డౌన్ సమయంలో ఆయా పరికరాలను శుద్ధి చేశాక అవసరానికి అనుగుణంగా కొత్తవి మార్చాలి. కానీ సంబంధిత కాంట్రాక్టర్లు పాత పరికరాలనే అమర్చి మమ.. అనిపిస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. ఇలాంటి పొరపాట్ల వల్ల భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంతంతమాత్రంగా పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు

కార్మికులకు సక్రమంగా పీఎఫ్, ఈఎస్‌ఐ వర్తింపజేయడం లేదు. ఈ విషయంలో కాంట్రాక్టర్ గానీ హెచ్‌పీసీఎల్ యాజమాన్యం కానీ పక్కాగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కార్మికులు నష్టపోతున్నారు. వీటి కోసం కార్మికుల జీతం నుంచి డబ్బులు కట్ చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. దీనిపై కార్మిక శాఖ అధికారులు కూడా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలున్నాయి. యూనియన్ నాయకులు కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కృషి, పట్టుదలతోనే విజయావకాశాలు

ఏపీ మెడిటెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మ



జితేంద్రశర్మకు సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అగనంపూడి, సెప్టెంబరు 14: విద్యార్థులు కృషి, పట్టుదల, సాధించాలనే తపనతో ముందుకు సాగితే ఎలాంటి విజయాన్ని అయినా సొంతం చేసుకోవచ్చని ఏపీ మెడిటెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన విస్టా-2024 టెక్నికల్ ఫెస్ట్ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జితేంద్ర శర్మ ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని రాణించాల్సిన అవసరం ఉందన్నారు. టెక్నికల్ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను తిలకించి, వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో అతిథులు దిలీప్‌కుమార్. దయానంద, ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, డీన్లు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు 'మోక్షగుండం'

గోపాలపట్నం: మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి మహనీయుల్ని ఆదర్శంగా తీసుకుని దేశఖ్యాతిని పెంచేలా ఇంజినీరింగ్ విద్యార్థులు ముందుకు సాగాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి నారాయణరావు పిలుపునిచ్చారు. నరవ గ్రామంలోని బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సాంకేతిక మార్పులను అందిపుచ్చుకుంటూ నూతన ఆవిష్కరణలకు తెరలేపాలన్నారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ బెహరా విజయచైతన్య, ఏడీ బి.తరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్ సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం వికటించడంతో వ్యక్తి మృతి!

మల్కాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన

మల్కాపురం, సెప్టెంబరు 14: శ్రీహరిపురంలోని హైమావతి నర్సింగ్ హోంనకు వైద్యం కోసం వచ్చిన రోగి చికిత్స పొందుతూ మృతి చెందడంతో అతని బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు చేపట్టారు. వివరాలివి.. అనారోగ్యంతో స్థానిక ఇందిరాకాలనీకి చెందిన శరగడం నాగేశ్వరరావు (48) శనివారం వైద్యం కోసం హైమావతి నర్సింగ్ హోంనకు తీసుకువచ్చారు. అయితే, అక్కడి వైద్యుడు నరసింగరావు అందుబాటులో లేరు. సిబ్బంది అందించిన చికిత్స వికటించి నాగేశ్వరరావు మృతిచెందినట్టు ఆరోపిస్తూ అతని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మల్కాపురం సీఐ విద్యాసాగర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతుని బంధువులతో మాట్లాడారు. వైద్యం వికటించడంతోనే నాగేశ్వరరావు చనిపోయినట్టు భావిస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రస్తుతం మృతుని బంధువుల తరపున నష్టపరిహారం విషయమై ఆస్పత్రి సిబ్బందితో కార్పొరేటర్ పీవీ సురేష్, మాజీ కార్పొరేటర్ పిల్లా కనకరాజు రాత్రి చర్చలు జరిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మృతుడు గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్

గాజువాక, సెప్టెంబరు 14: చినగంట్యాడ సమీపంలోని కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక శ్రామికనగర్ ప్రాంతంలో నివాసముంటున్న ఎం.వెంకటరావు (55) గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో అటెండరుగా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన వెంకటరావు చినగంట్యాడ సమీపంలోని కాలువలో పడిపోయి మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అటెండర్ వెంకటరావు మృతదేహం

'రాజకీయ నిర్ణయంతోనే స్టీల్‌ప్లాంట్ రక్షణ సాధ్యం'

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 14: స్టీల్‌ప్లాంట్ రక్షణ రాజకీయ నిర్ణయంతోనే సాధ్యమని సీపీఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరాజు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం గాజువాకలో నిర్వహించనున్న మహా ధర్నాకు సంబంధించిన పోస్టరును శనివారం ఆయన ప్లాంట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణ, పోరాటాల త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్టీల్‌ప్లాంటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు కేఎం శ్రీనివాస్, వైటీ దాసు, టీవీకే రాజు, బి.మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

దూడను కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



తల్లి చెంతకు చేరిన దూడ

పెదగంట్యాడ, సెప్టెంబరు 14: తల్లీబిడ్డల మధ్య అనుబంధం మనుషులకే కాదు పశువులకూ ఉంటుందని నిరూపితమైంది. ఓ దూడ ప్రమాదవశాత్తు ఇక్కడి డ్రైనేజీలో పడిపోతే దానిని రక్షించేందుకు తల్లి ఆవు పడిన ఆరాటం ఇందుకు ఉదాహరణ. నెల్లిముక్కు మెయిన్ రోడ్డులో శుక్రవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాత్రి పదిన్నరప్పుడు ఐదు నెలల దూడ మేతను వెతుక్కుంటూ వచ్చి ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయింది. ఈ కాలువ చాలా ఇరుకుగా ఉండడంతో బయటకు ర రాలేక పెద్దగా అరవసాగింది. ఆ అరుపులకు పరిసరాల్లో ఉన్న తల్లి ఆవు అక్కడకు చేరుకుంది. దూడను బయటకు తీయలేక అదికూడా పెద్దగా అరుస్తుండడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఈ విషయాన్ని కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంటనే పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి స్థానిక యువకులతో కలిసి దూడను బయటకు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సహకరించిన యువకులను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి రమణారెడ్డి అభినందించారు.



70వ వార్డు టీవీఎస్ కాలనీ కొలువుదీరిన బాలగణపతి



పెదమడకలో చందనభరితుడైన గణేశుడు



సుజాతనగర్‌లో స్వామివారికి గరికపూజ



ఎస్టీబీఎల్ ఎల్ఎన్ గార్డెన్స్‌లో పూజల్లో పాల్గొన్న మహిళలు

గణనాథునికి ప్రత్యేక పూజలు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 14: వినాయక చవితి ఉత్సవాలను పలు ప్రాంతాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 88వ వార్డు పరిధి ఎస్టీబీఎల్‌లో ఎల్ఎన్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మండపంలో శనివారం గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు, హోమాలు జరిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు జీవీ కృష్ణయ్య, జి.గంగామహేశ్, చైతన్యకృష్ణ, గాంధీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే 70వ వార్డు టీవీఎస్ కాలనీలోని బాలగణపతి మండపంలో కాలనీ వాసులు, మహిళలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు కేవీఎస్ శంకరరావు, బొడ్డే రమణ, పీఎంఎల్ నాయుడు, జ్యోతి, రాజు, కనక, కోటి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెదమడకలో చందనం పూజ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సంపత్ వినాయక ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి చందనంతో పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి గణనాథున్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజనా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, ఎం.నరసింగరావు, వి.నారాయణరావు, ఎం.శ్రీనివాసరావు, వి.రాము, సోమేశ్వరరావు, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

నాయుడుతోటలో గరికపూజ

వేపగుంట: నాయుడుతోట అప్పలనర్సయ్యనగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో స్వామివారికి గరికపూజ చేశారు. సంతోషిమాత ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్న సమారాధన చేపట్టారు. అలాగే వెంకటనాయినగర్‌లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలోనూ అన్న సంతర్పణ జరిపారు. ప్రహ్లాదపురంలో క్రేజీ గయ్స్ ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని రెడ్ ఎఫ్ఎం ప్రతినిధులు ఉత్తమ పర్యావరణ మండపంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాతిక కిలోల లడ్డూను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు చేతుల మీదగా మండప నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో అన్న సమారాధనలు

పెందుర్తి: పెందుర్తిలోని రాతిచెరువు, దొగ్గవానిపాలెం, పాత పెందుర్తి, పెందుర్తి కూడలి, ద్రోణంరాజు నగర్‌లలోని గణపతి మండపాల వద్ద శనివారం చేపట్టిన అన్న సమారాధన కార్యక్రమాలకు మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు హాజరై ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు ఎ.స్వామినాయుడు, ఎం.నాగఅప్పారావు, దుర్గానగర్ మల్లేశ్, శరగడం శ్రీను, హరి, తదితరులు పాల్గొన్నారు

చింతల అగ్రహారంలో అన్న సమారాధన

పెందుర్తి-రూరల్: మండలంలోని చింతల అగ్రహారం రామాలయం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్న సమారాధన చేపట్టారు. ముందుగా గణనాథునికి ప్రత్యేక పూజలు చేయగా, పలువురు భక్తులు విష్ణు, లలితసహస్రనామ పారాయణాలను పఠించారు. సాయంత్రం మేళతాళాలు, యువకుల సందడి నడుమ గణేశున్ని ఊరేగించి నిమజ్జనం చేశారు.



అన్న సమారాధనలో పాల్గొన్న శరగడం చినఅప్పలనాయుడు





ఏయూలో కంటైనర్ దుకాణాల ఏర్పాటుపై ఫిర్యాదులు

▸▸ తొలగింపునకు సిద్ధమైన అధికారులు ▸▸ ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు ▸▸ తుది నిర్ణయానికి కమిటీ ఏర్పాటు

విశాఖపట్నం,సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీలోని అనేక చోట్ల కంటైనర్ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు గత పాలకులు అనుమతి ఇచ్చారు. వీటిని స్టార్టప్‌లుగా పరిగణించారు. వీటికి సంబంధించిన అద్దె, ఇతర మొత్తాలను కూడా వర్సిటీ రిజిస్ట్రార్, ఉన్నతాధికారులకు కాకుండా ఆ హబ్‌లోని అధికారులకు చెల్లిస్తున్నట్టు చెబుతున్నారు. అయితే, దీనిపై కొద్దిరోజుల నుంచి వర్సిటీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ వ్యవహారం మరింత ముదురుతుండడంతో అప్రమత్తమైన అధికారులు వర్సిటీలోని 12 చోట్ల ఏర్పాటు చేసిన కంటైనర్ దుకాణాలు తొలగించేందుకు సిద్ధమయ్యారు.

అయితే, ఆయా దుకాణాలకు సంబంధించిన యజమానులు (స్టార్టప్ నిర్వాహకులు అని చెబుతున్నారు) ఉన్నతస్థాయిలో సిఫార్సులు చేయిస్తున్నారు. దీంతో వాటిని తొలగించడం అధికారులకు ఇబ్బందిగా మారింది. వీటివల్ల అనేక చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నట్టు పలువురు వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఒత్తిళ్ల వల్ల తొలగించకుండా ఉండడం కూడా ఇబ్బందిగా మారుతుందని భావించిన అధికారులు.. వీటిని కొనసాగించాలా..? తొలగించాలా..? అన్న విషయాలను తేల్చేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. రెండు, మూడు రోజుల్లో కమిటీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. వర్సిటీలోని ప్రధాన క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి కొద్దిరోజుల్లో టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. క్యాంటీన్ కొనసాగింపునకు సంబంధించి ప్రస్తుతం కోర్టులో కేసు ఉంది.

చవితి ఉత్సవాల నిర్వహణ అభినందనీయం


వృద్ధురాలికి దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమా శ్రీధర్


ఆదిత్య గణపతి అలంకారంలో దుర్గాగణపతి

డాబాగార్డెన్స్/పూర్ణామార్కెట్ సెప్టెంబరు 14: వినాయక చవితి మహోత్సవాలను వివిధ కమిటీల సభ్యులు సుహృద్భావ వాతావరణంలో చేపట్టడం ఆనందదాయకమని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో పూర్ణామార్కెట్ వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆశ్రమంలోని వృద్ధులకు చీరలు, రాత్రి దుస్తులు, పండ్లు అందజేశారు.

అక్కయ్యపాలెం: తాటిచెట్లపాలెంలోని శ్రీసాక్షి మహాగణపతి ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రైల్వే న్యూకాలనీలోని శ్రీసాయి నిలయం ఫ్లాట్ ఓనర్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జ్ఞానాపురం: జ్ఞానాపురంలో బ్లడ్‌లైన్ బాయ్స్, జీఎఫ్ఏ బాయ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ హాజరై అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. దీంతో పాటు శనివారం జ్ఞానాపురంలో జరిగిన అన్నదాన కార్యక్రమాలకు రూ.40 వేల విరాళం అందించారు.

అశ్వరథ వాహనంపై దుర్గాగణపతి

సీతంపేట: సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో ఈఓ రమాభాయి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆదిత్య గణపతి అవతారంలో సుందరంగా అలంకరించారు. అశ్వరథంపై స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ముఖ్యం

▸▸ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మంజుల

విశాఖపట్నం, సెప్టెంబరు 14: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో స్వస్థ్ మహిళ, స్వస్థ్ భారత్ కార్యక్రమం జరిగింది. హెల్త్ క్లబ్, యువీకెన్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించి, వైద్యుల పర్యవేక్షణలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినులకు స్క్రీనింగ్ పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల హాజరై స్వస్థ్ మహిళ, స్వస్థ్ భారత్ ప్రాధాన్యం తెలుపుతూ మహిళలు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పొంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ క్లబ్ కన్వీనర్ ఎ.జ్యోతి, యువీకెన్ ఫౌండేషన్ డాక్టర్ మాధురి, డాక్టర్ సాయి చరిత, తేజస్వి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లకు సెలవుపై ఎమ్మెల్యే హామీ


ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సీతమ్మధార, సెప్టెంబరు 14: రైతులకు, రైతు బజార్లకు వారంలో ఓ రోజు ఇస్తున్న సెలవును యథాతథంగా కొనసాగించాలని రైతులు ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు విష్ణుకుమార్ రాజును కలిసి విజ్ఞప్తి చేశారు. రైతులకు వారంలో ఇస్తున్న ఒక్క రోజు సెలవును సీతమ్మధార, కంచరపాలెం, ఎంవీపీ కాలనీ, అక్కయ్యపాలెం నరసింహనగర్ రైతు బజార్లకు రద్దు చేస్తూ జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రైతులు తమకు సెలవు కావాలంటూ విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రాన్ని సమర్పించారు. సెలవు కొనసాగించేలా అధికారులతో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా ఎమ్మెల్యే కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 6న జూ మారథాన్

మహారాణిపేట, సెప్టెంబరు 14: వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 6న వైజాగ్ జూ మారథాన్ 3వ ఎడిషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు నిర్వాహకులు డాక్టర్ కృష్ణచైతన్య తెలిపారు. శనివారం బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మారథాన్‌కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. అక్టోబరు 6న ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు నుంచి మారథాన్ ప్రారంభమవుతుందని, ఇందులో 21 కె, 10 కె, 5 కె, 3 కె పేరిట పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విజేతలకు రూ.3 లక్షల నగదు పారితోషికం ఉంటుందని తెలిపారు. ముందుగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అసోసియేషన్ సభ్యులు యోగేష్, రవి, శ్రీరామ్, యశ్వంత్ పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన గంజాయి నిందితుడు

విశాఖపట్నం, సెప్టెంబరు 14: రైల్వే స్టేషన్‌లో గంజాయి తరలించేందుకు యత్నిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన సదిరి సత్తిబాబు గంజాయి రవాణాకు రెక్కీ నిర్వహిస్తుండగా గమనించి అదుపులోకి తీసుకున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. నిందితుని విచారించిన అనంతరం కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని పేర్కొన్నారు.రైల్వే స్టేషన్‌లో నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, గంజాయి రవాణాతోపాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై నిఘా ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు.

'డిమాండ్ల సాధనలో ఐసీఈయూ కీలకం'


వేదికపై ఐసీఈయూ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 14: ఎల్ఐసీ ఉద్యోగుల డిమాండ్ల సాధనలో ప్రభుత్వ రంగంలో ఎల్ఐసీ పరిరక్షణ, కార్మికవర్గ పోరాటాల సాధనలో ఐసీఈయూ కీలక పాత్ర పోషించిందని విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ అన్నారు. శనివారం ఎల్ఐసీ భవన్‌లోని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ గోల్డెన్ జూబ్లీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులకు ట్రేడ్ యూనియన్ విద్య, క్లెయిమ్‌ల పరిష్కారం, బడ్జెట్-2024 వంటి విభిన్న సమకాలీన అంశాలపై అనేక సదస్సులు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఐఆర్‌డీఏ ప్రతిపాదనలు మొదలైన అనేక కార్యకలాపాలతో గోల్డెన్ జూబ్లీ సంవత్సరం జరుపుకొన్నామన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా పేద పిల్లలకు పుస్తకాల పంపిణీ, గిరిజన హాస్టళ్లలో వైద్య శిబిరం కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఛైర్‌పర్సన్ ఎస్.కృష్ణమూర్తి, అధ్యక్షురాలు ఎం.కామేశ్వరి, బి.శ్రీనివాసరావు, తిరుమలరావు, రవీంద్రనాథ్ ఠాగూర్, జి.ఎల్.ప్రసన్న, మీడియా ఇన్‌చార్జ్ ఎ.రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

స్వయం నిర్ణయాలతోనే మహిళా సాధికారత

▸▸ స్వాగత వేడుకల్లో న్యాయ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సుమిత్రా శ్రీపాద

జ్ఞానాపురం, సెప్టెంబరు 14: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం 67వ స్టూడెంట్ కౌన్సిల్ ఫ్రెషర్స్ డే (స్వాగత) వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. నూతన విద్యార్థులను స్వాగతిస్తూ ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తెలిపారు. ఈ వేడుకల ప్రారంభానికి ముఖ్యఅతిథిగా డా.బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుమిత్రా శ్రీపాద హాజరయ్యారు. ఆమె సైబర్ క్రైమ్, గృహహింస చట్టంపై అవగాహన కల్పిస్తూ మహిళల్లో స్వయం నిర్ణయాత్మక శక్తి పెరిగినప్పుడే సాధికారిత పొందినట్లని ఉద్బోధించారు. అనంతరం విద్యార్థులు చక్కని శాస్త్రీయ, పాశ్చాత్య, జానపద నృత్యాలు, పాటలు, మూకాభినయంతో ఆహూతులను అలరించారు. మిస్ ఫ్రెషర్ విభాగంలో డిగ్రీలో సాయి ప్రణతి, వైష్ణవి, ఇంటర్మీడియట్‌లో పల్లవి, కీర్తన విజేతలుగా నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్ కిరీటాలు తొడిగి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సలహాదారులు డాక్టర్ హరిణి, పావని, ప్రమీల, సిస్టర్ దీపాలి, డాక్టర్ రమణీలత, డాక్టర్ పవన్, డా.పి.కె.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


స్వాగత వేడుకల్లో జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

విశాఖ కంటెయినర్ టెర్మినల్‌లో ప్రమాదం

▸▸ లిథియం బ్యాటరీలను లోడ్ చేస్తుండగా ఒక బాక్సులో పొగలు

▸▸ రజనీకాంత్ సినిమా షూటింగ్‌లో ప్రమాదం జరిగినట్టు వదంతులు

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్ పక్కనే ఉన్న విశాఖ కంటెయినర్ టెర్మినల్‌లో శనివారం స్వల్ప ప్రమాదం జరిగింది. లిథియం బ్యాటరీలను కంటెయినర్‌లోకి ఎక్కిస్తుండగా ఒక బాక్సులో పొగలు వచ్చాయి. వెంటనే పోర్టు అగ్నిమాపక శకటాన్ని రప్పించి పొగలను ఆర్పివేశారు. ఈ బ్యాటరీలు చైనా నుంచి ఆగస్టు 28న ఇక్కడకు వచ్చాయి. వాటిని కోల్‌కతా పంపేందుకు ఇప్పుడు లోడింగ్ చేస్తుండగా స్వల్ప ప్రమాదం జరిగింది. ఈ విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విశాఖ కలెక్టర్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకుంది. అయితే అక్కడ సినిమా హీరో రజనీకాంత్ షూటింగ్ జరుగుతుండగా ఈ ప్రమాదం జరిగిందని వదంతులు రావడంతో జిల్లా అధికారులు పూర్తి వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి నష్టంజరగలేదని పేర్కొన్నారు.

ఇకపై ఒక్కరే ఎంఈవో?

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. మారుమూల ప్రాంతంలో ఉన్న స్కూల్ కాంప్లెక్స్ బాధ్యత అందుబాటులో ఉన్న ఉన్నత పాఠశాలకు అప్పగించనున్నారు. ప్రధానోపాధ్యాయ పోస్టు లేని బోని స్కూలు కాంప్లెక్స్‌ను గొట్టిపల్లిలో, గండిగుండంను గిడిజాలలో కలుపుతున్నారు. స్కూలు కాంప్లెక్స్ పరిధిలో 35 నుంచి 87 ఎస్జీటీ టీచర్లు ఉండేలా మార్పులు చేస్తున్నారు. తాజా నిర్ణయంతో స్కూలు కాంప్లెక్స్ హెచ్ఎంలకు ఎక్కువ అధికారాలు అప్పగిస్తున్నారు. ఎస్జీటీలకు సంబంధించి సర్వీస్ వ్యవహారాలు, సెలవులు మంజూరు అధికారాలు కట్టబెడతారు. ఇక ఎంఈవోలను పాఠశాలల తనిఖీ బాధ్యతల వరకే పరిమితం చేయనున్నారు.

వరద బాధితులకు అండగా ర్యాలీ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 14: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిల స్ఫూర్తితో విద్యార్థులు, నిరుద్యోగ యువతతో కలసి వరద బాధిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలు చేపడతామని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ తెలిపారు. సహాయం చేసేందుకు సేవాభావం గలవారు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శనివారం నరసింహనగర్‌లో 'మానవసేవయే మాధవసేవ' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. గొప్ప ప్రకాశ్, జి.రంగారావు, జి.రఘుబాబు, ఐ.ప్రియాంక, షీలా సుమన్ తదితరులు పాల్గొన్నారు.

11 మంది ఎస్ఐల బదిలీ

మహారాణిపేట, సెప్టెంబరు 14: విశాఖ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పలువురు పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్‌లకు బదిలీలు జరిగాయి. కె.సురేష్‌కుమార్ (త్రీటౌన్) డి.వరలక్ష్మి (స్టీల్ ప్లాంట్ ట్రాఫిక్), కోమరా శ్రీనివాసరావు (వన్‌టౌన్ ట్రాఫిక్), సీహెచ్ సూర్యనారాయణ (పద్మనాభం), కె.భాస్కర్‌రావు (పీఎంపాలెం), ఎన్.గౌరి (భీమిలి), సీహెచ్ స్వామినాయుడు(పెందుర్తి), ఎస్.సురేష్ (ఎయిర్ పోర్టు), ఎస్.క్రిష్ణవర్మ (గాజువాక ట్రాఫిక్), ఎల్. శ్రీనివాసరావు (దువ్వాడ), ఎం.రాధాకృష్ణ గాజువాక పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

కనక మహాలక్ష్మికి స్వర్ణ కవచాలంకరణ



జగదాంబ కూడలి, సెప్టెంబరు 14: వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణ కవచాలంకరణతో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక శోభతో దర్శనమిచ్చిన అమ్మవారిని చూసి భక్తులు తన్మయులయ్యారు. అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. పవిత్రోత్సవ పూజల్లో భాగంగా రెండో రోజు వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య పూజల్లో భాగంగా తులసీదళార్చన సేవల్లో ఉభయదాతలతో అర్చకులు పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి, జేఈవో వి.రాంబాబు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో లక్ష్మీ సహస్రకు అవార్డు


అవార్డు అందచేస్తున్న నిఖిల్ బాబ్ లాడి

సీతమ్మధార, సెప్టెంబరు 14: టొయోట సంస్థ 15 సంవత్సరాలలోపు విద్యార్థులకు నిర్వహించిన డ్రీమ్ కార్ చిత్ర లేఖన పోటీల్లో శ్రీప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థిని బహుమతి గెలుచుకుంది. ఈ పోటీల్లో 90 దేశాల నుంచి 7.12 లక్షల మంది విద్యార్థులు పాల్గొనగా 26 మంది తుది జాబితాకు ఎంపికయ్యారు. అందులో భారత దేశంలోనే ఉత్తమ అవార్డును విశాఖపట్నం శ్రీప్రకాష్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని పి.లక్ష్మి సహస్ర కైవసం చేసుకుంది. లక్ష్మి సహస్రకు టొయోట కిర్లోస్కార్ మోటార్స్ ఆంధ్ర స్టేట్ హెడ్ నిఖిల్ బాబ్ లాడి రూ.3 లక్షల నగదు బహుమతిని, ట్రోఫీని అందజేశారు. ఇదే విద్యాసంస్థకు చెందిన మరో 13 మంది విద్యార్థులకు కూడా నగదు బహుమతులిచ్చారు. విజేతలను విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాష్ అభినందించారు.

రుణం పేరుతో వల..

... 5వ పేజీ తరువాయి

పెట్టుకోవడం, ఏజెంట్ల ద్వారా అన్ని రాష్ట్రాలకు చెందిన సిమ్ కార్డులను సంపాదించడం చేస్తున్నారు. ఏ రాష్ట్రానికి చెందిన వ్యక్తికి ఆ రాష్ట్రానికి చెందిన సిమ్ కార్డు నుంచి ఫోన్ చేసి, ఆ రాష్ట్ర భాషలో మాట్లాడిస్తారు. కాంబోడియా నుంచి ఇదే తరహా మోసాలకు పాల్పడే ముఠా చేతిలో చిక్కుకున్న ఏపీ, తెలంగాణకు చెందిన వందలాది మందిని నగర పోలీసులు ఇటీవల విడిపించి తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

బొర్రా గుహలకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి



రోజూ వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. కానీ వారికి సరైన ప్రయాణ, పార్కింగ్, వసతి సౌకర్యాలు లేవు. ఈ నేపథ్యంలో 5.89 ఎకరాల్లో రూ.24 కోట్లతో సౌకర్యాలు సమకూర్చాలని ఏపీటీడీసీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో అచ్చంగా రెండు ఎకరాల స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించారు. అలాగే బొర్రా గుహలకు వెళ్లే మార్గంలో అందమైన ద్వారం, గుహల వద్ద మరో ద్వారం నిర్మిస్తారు. ఆ ప్రాంతం వాహనాల పొగతో కాలుష్యమయం కాకుండా ఎలక్ట్రిక్ వాహనాలను నడుపుతారు. వాటి ద్వారా పర్యాటకులను గుహలకు తీసుకువెళ్లి తీసుకువస్తారు. పర్యాటకుల కోసం టాయిలెట్లు, లగేజీ భద్రపరుచుకునే గదులు, తాగునీటి సౌకర్యం కల్పిస్తారు.

ప్రత్యేకంగా మార్కెట్ స్ట్రీట్

బొర్రా గుహల ముందు గిరిజనులు తయారుచేసిన, పండించిన వాటిని విక్రయిస్తున్నారు. దీనిని మార్కెట్ స్ట్రీట్‌గా అభివృద్ధి చేస్తారు. రెండు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. పర్యాటకులు పక్కనే ఉన్న లోయ అందాలను తిలకించేందుకు వ్యూపాయింట్లు, విజువల్ డెక్ ఏర్పాటుచేస్తారు. సిటింగ్ ఏరియా ఉంటుంది. అడ్వంచర్ స్పోర్ట్స్ ఎగ్జిబిషన్ వంటివి పెడతారు.

విజిటర్స్ కౌంటర్

పర్యాటకుల వసతి కోసం రెండు అంతస్థుల భవనం నిర్మిస్తారు. ఇక్కడే టికెట్లు, బ్యాగేజీ, రెస్టారెంట్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఇక గుహల లోపల అవసరమైన ప్రాంతాల్లో స్టెయిర్ కేసులు, రెయిలింగ్‌లు పెడతారు. కొత్తగా విద్యుద్దీపాలు అమరుస్తారు. సీసీ టీవీ కెమెరాలు వంటివి ఉంటాయి.

సౌండ్ అండ్ లైటింగ్ షో

గుహ లోపలి అందాలను విభిన్న కోణాల్లో చూపించడానికి సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటుచేస్తారు. దాంతో కళ్ల ముందు రంగుల ప్రపంచం ఆవిష్కృతమవుతుంది. ఇది మరిచిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. ఈ ప్రాజెక్టుకు టెండర్లు సమర్పించడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఇచ్చినట్టు పర్యాటక శాఖ ప్రాంతీయ డైరెక్టర్ శ్రీనివాస పాణి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణే ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

పరిస్థితులను ప్రజా ప్రతినిధులకు కార్మికులు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, ప్రసాదుల శ్రీనివాస్, ఉక్కు పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు, కేఎస్ఎన్ రావు, విళ్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.





నర్తన గణపతిగా సంపత్ వినాయగర్



సిరిపురం, సెప్టెంబరు 14 : సిరిపురంలోని సంపత్ వినాయగర్ ఆలయంలో రుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు నర్తన గణపతిగా భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. ఈసందర్భంగా వేకువజామున ఐదు గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నాదస్వర కచేరి, ఆధ్యాత్మిక ప్రసంగం, స్వామివారి విశిష్టతను తెలిపే ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈవో కె. శిరీష, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ చోళన్, జి.గోవిందరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అప్పన్న దర్శనానికి భక్తుల రద్దీ

సింహాచలం, సెప్టెంబరు 14 : వరాహలక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు.విద్యా సంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా-ఆంధ్రా సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అత్యధికులు శుక్రవారం రాత్రి కొండదిగువకు చేరుకుని వేకువజామున పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. భైరవస్వామిని దర్శించుకుని కొందరు మెట్లమార్గంలో, మరికొందరు బస్సుల్లో సింహగిరికి చేరుకున్నారు. తలనీలాలు సమర్పించి, పవిత్ర గంగధారలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈఓ శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో అధికారులు ఏర్పాట్లు చేశారు.

సంప్రదాయబద్ధంగా పవిత్ర ప్రతిష్ఠాపన

సింహాచలం, సెప్టెంబరు 14 : వరాహలక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం పవిత్ర ప్రతిష్ఠాపన సంప్రదాయబద్ధంగా జరిపారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై ఉంచారు. యజ్ఞ భగవానునిగా సుదర్శన పెరుమాళ్‌ను ముందుగా సిద్ధం చేసి చక్రాబ్జ మండలంలో అధిష్ఠింపజేశారు. తరువాత ఆలయ అధ్యాపకులు, పండితులు చతుర్వేదాలు, రామాయణ, భారత, విష్ణుపురాణాలు, క్రిష్ణమయ్య సంకీర్తనలు తదితర పారాయణలతో స్వామికి విన్నపాలు చేశారు. తరువాత హోమకుండంలో అగ్నిప్రతిష్ఠ చేసి హోమాన్ని జరిపారు. ఉత్సవాల్లో ప్రధానమైన పవిత్రాలను ప్రతిష్ఠాపన జరిపి వాటికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవి రమణాచార్యులు, పురోహితులు కరి సీతారామాచార్యులు వైదిక కార్యక్రమాలు నిర్వహించగా ఆలయ ఏఈఓ ఎన్. ఆనందకుమార్ ఏర్పాట్లు చేశారు.

ఇద్దరు వసతి గృహ ఉద్యోగుల సస్పెన్షన్

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులతో మరుగు దొడ్లను శుభ్రం చేయించిన వ్యవహారంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చర్యలు తీసుకున్నారు. నగర పరిధిలోని సీతమ్మధారలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులతో హాస్టల్ అధికారులు మరుగుదొడ్లను శుభ్రం చేయించారు. దీనిపై ఈనెల 9న విద్యార్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారించిన ఆయన వాస్తవమని తేలడంతో హాస్టల్ సంక్షేమ అధికారి ప్రసాదరావును సస్పెండ్ చేయడంతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగి ఎం. అప్పారావును విధుల నుంచి తొలగిస్తూ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

వైద్యం వికటించడంతో మృత్యువాత

మల్కాపురంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఘటన

మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన

మల్కాపురం, సెప్టెంబరు 14 : శ్రీహరిపురంలోని ఓ నర్సింగ్ హోమ్‌కు వైద్యం కోసం వచ్చిన రోగి చికిత్స పొందుతూ మృతిచెందడంతో అతని బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు చేపట్టారు. స్థానిక ఇందిరాకాలనీకి చెందిన శరగడం నాగేశ్వరరావు (48) శనివారం వైద్యం కోసం నర్సింగ్ హోమ్‌కు తీసుకువచ్చారు. వైద్యుడు అందుబాటులో లేరు. సిబ్బంది అందించిన చికిత్స వికటించడంతో నాగేశ్వరరావు మృతి చెందినట్టు ఆరోపిస్తూ అతని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మల్కాపురం సీఐ విద్యాసాగర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతుని బంధువులతో మాట్లాడారు. వైద్యం వికటించడంతోనే నాగేశ్వరరావు చనిపోయినట్టు భావిస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. మృతుని బంధువుల తరపున నష్టపరిహారం విషయమై ఆస్పత్రి సిబ్బందితో కార్పొరేటర్ పీవీ సురేష్, మాజీ కార్పొరేటర్ పిల్లా కనకరాజు రాత్రి చర్చలు జరిపారు.

బైక్ బోల్తా పడి యువకుడి మృతి

ఆరిలోవ, సెప్టెంబరు 14 : జూపార్కు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ద్వారకా ట్రాఫిక్ సీఐ తెలిపిన వివరాలు ప్రకారం.. కొమ్మాదికి చెందిన అన్నంనాయుడు వాల్తేరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వేకువజామున ఐదు గంటలకు అతని కుమారుడు చంద్రశేఖర్ (21) తండ్రిని బైక్‌పై ఎక్కించుకుని విధుల కోసం డిపోకు తీసుకువెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా జూపార్కు సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడు బీఎస్సీ చదువుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా అన్నంనాయుడు దంపతులకు ఒక్కరే సంతానం కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం : గంటా

సింహాచలం, సెప్టెంబరు 14 : విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు తమ కుటుంబం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన కర్నాటకకు చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి, అశోక్, ఎంపీ మునిస్వామితో కలిసి వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ నేత విజయ్ సాయిరెడ్డి ఎక్స్ వేదికగా చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తాను రాజీనామా చేసినప్పుడు వైసీపీ ఎంపీలు కూడా రాజీనామా చేసి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదన్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. టీడీపీ నాయకులపై అనవసరంగా మాట్లాడటం విజయసాయిరెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ. 54 కోట్లతో సింహగిరిపై జరుగుతున్న అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర దేవదాయ శాఖ అనుమతించిన సింహగిరి మాస్టర్ ప్లాన్‌లోని పనులకు ప్రసాద్ స్కీమ్ పనులకు పొంతన లేదని చెప్పారు. త్వరలో ఇరు శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ప్లాన్, పనులపై సమీక్షించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 2 లో..

మహిళా సాధికారతతోనే దేశం అభివృద్ధి

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- దసరా ఉత్సవ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

సిరిపురం, సెప్టెంబరు 14 : ఉన్నతాశయంతో మహిళలు నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో మహావీర్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవ్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే దేశం ముందడుగు వేస్తుందన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రియదర్శిని ఓల్డేజ్ హోం పునర్నిర్మాణానికి ఇవ్వాలన్న ఆలోచన అభినందనీయమన్నారు. అనంతరం ఆయన స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్‌పర్సన్ సునీత రెకేచ, కార్యదర్శి దివ్య లల్వాని, ఫ్యాన్సీ జైన్, నిర్మల హిరావత్, సుభోద్ రెకేచ, తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆధ్యాత్మికభావంతో మానసిక ప్రశాంతత

ఆనందపురం : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావంతో మెలగాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గంభీరం ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెరిటేజ్ ఫెస్ట్ -2024 విజేతలకు శనివారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే ఆధ్యాత్మిక అవగాహన అవసరమన్నారు. విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ భక్తిభావాలు పెంపొందించడంలో హరేకృష్ణ మూవ్మెంట్ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని, భక్తి మార్గంలోకి రావాలన్నారు. హరేకృష్ణ మూవ్మెంట్ ప్రెసిడెంట్ నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ గత నెల 16 నుంచి 24 వరకు పోటీలు నిర్వహించగా 44 పాఠశాలల నుంచి మూడు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, చిత్రలేఖనం, భగవద్గీత శ్లోక పఠనం, గాత్ర సంగీతం పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వినాయక ఆలయంలో నిర్వహిస్తున్న గణపతి కల్యాణం

ఎండాడ స్కైలైన్‌లో గణపతి కల్యాణం

ఎండాడ, సెప్టెంబరు 14 : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఉన్న స్కైలైన్ అపార్ట్‌మెంట్‌లో గణపతి ఉత్సవాల్లో భాగంగా అపార్ట్‌మెంట్ ఆవరణలో ఉన్న వినాయక ఆలయంలో శనివారం గణపతి కల్యాణం నిర్వహించారు. అనంతరం కల్యాణ ఉత్సవ మూర్తులను అపార్ట్‌మెంట్ ఆవరణలో ఊరేగించారు. అంతకముందు నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ రామయ్య చౌదరి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, స్కైలైన్ అపార్ట్‌మెంట్స్ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మూట్ కోర్టు పోటీల్లో పాల్గొన్న పలు రాష్ట్రాల యువ న్యాయవాదులు

ఎన్‌వీపీ లా కళాశాలలో మూట్ కోర్టు పోటీలు

మధురవాడ, సెప్టెంబరు 14 : రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల ప్రకారం ప్రజలందరికీ సమ న్యాయం అందేలా యువ న్యాయవాదులు కృషి చేయాలని ఏయూ రెక్టార్ ఆచార్య కిశోర్‌బాబు అన్నారు. మధురవాడ న్యాయ విద్యా పరిషత్ లా కళాశాలలో శనివారం మూట్ కోర్టు పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి పలువురు యువ న్యాయవాదులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిశోర్‌బాబు మాట్లాడుతూ యువ న్యాయవాదులు రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రజలందరికీ చేరే విధంగా పనిచేయాలన్నారు. 1980లో ఎస్. ఆళ్వార్‌దాస్ ఏర్పాటు చేసిన ఎన్‌వీపీ లా కళాశాల ఇప్పటివరకు సుమారు 12 వేల మంది న్యాయవాదులను దేశానికి అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. కాగా పోటీల్లో హైదరాబాద్, బెంగళూరు, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలకు చెందిన 22మంది యువ న్యాయవాదులతో పాటు నేషనల్ లా యూనివర్సిటీలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.ఆదివారంతో పోటీలు ముగియనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర, డైరెక్టర్లు విజయా రవీంద్ర, దీపికాదాస్, ప్రిన్సిపాల్ అలక్ చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ భూములను పరిశీలించిన కలెక్టర్

సింహాచలం, సెప్టెంబరు 14 : పంచ గ్రామాల భూవివాదం పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈమేరకు శనివారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్, దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి, ఆర్డీఓ హుసేన్ సాహెబ్ గాజువాక, ఆనందపురం, పెదగంట్యాడ, ములగాడ ప్రాంతాల్లో పర్యటించి స్థలాలను పరిశీలించారు. ఆయా ప్రత్యామ్నాయ స్థలాలపై దేవస్థానం అధికారులు అంత సుముఖంగా లేనట్టు తెలుస్తోంది. కలెక్టర్ తన నివేదికను ప్రభుత్వానికి త్వరలో అందజేయనున్నారు.

'స్టీల్‌ప్లాంటు బలోపేతానికి చర్యలు తీసుకోవాలి'

వెంకోజీపాలెం, సెప్టెంబరు 14 : విశాఖ స్టీల్‌ప్లాంటు బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ కోరారు. ఈమేరకు శనివారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఫ్యాక్స్ ద్వారా లేఖ రాశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఢిల్లీ పెద్దలతో విశాఖ స్టీల్‌ప్లాంటు అంశం మాట్లాడకపోవడం బాధాకరమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా ముడిసరుకు సరఫరా చేయకుండా ఉద్దేశపూర్వకంగానే వ్యవహరిస్తుందన్నారు. తక్షణమే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంటు అమ్మకం నిర్ణయం ఉపసంహరించుకోవడం, సొంత గనులు కేటాయించడం, అవసరమైన ముడి సరుకు సరఫరా చేయడం, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వడం వంటి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

కొండచిలువ కలకలం

ఆరిలోవ, సెప్టెంబరు 14 : జీవీఎంసీ 9వ వార్డు చినగదిలి తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న ఏసీబీ కార్యాలయం ఎదుట కొండచిలువ శనివారం కలకలం రేపింది. ఎండాడ నుంచి ఆదర్శనగర్‌కు తాగనీరు వెళ్లే పంప్ హౌస్ వద్ద నీటిని విడుదల చేయడానికి వెళ్లిన ఆపరేటర్‌కు సుమారు 12 అడుగుల కొండచిలువ కనిపించింది. ఆయన భయాందోళనతో గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారం అందించారు. ఆయన అక్కడికి వెళ్లి కొండచిలువను చాకచక్యంగా పట్టుకుని, దగ్గరలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాడు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

భీమునిపట్నం, సెప్టెంబరు 14 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని చిప్పాడ దివీస్ కంపెనీ సీఎస్ఆర్ మేనేజర్ డి. సురేష్‌కుమార్ అన్నారు. శనివారం భీమిలిలోని ది సన్ స్కూల్ ఆవరణలో 49వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ - 2024 పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ సంస్థ ఎల్లవేళలా ముందుంటుందన్నారు. యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రావి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారని చెప్పారు. విజేతలను జాతీయ యోగాసన పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వర్మ, కార్యదర్శి అవినాష్, విశాఖ జిల్లా అధ్యక్షుడు రవి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామారావు, ఉపాధ్యక్షుడు జేడీ చక్రవర్తి, కోశాధికారి రాపర్తి శ్రీను, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, ది సన్ స్కూల్ విద్యా సంస్థల అధినేత కైతపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు గంటా నూకరాజు, గాడు అప్పలనాయుడు, యరబాల అనిల్ ప్రసాద్, కొక్కిరి అప్పన్న, సంకురుభక్త జోగారావు పాల్గొన్నారు.

పేదలకు విద్య, వైద్య సేవలు

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు విద్య, వైద్య సేవలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని టీబీకే రాష్ట్ర కన్వీనర్ దాసరి రాము అన్నారు. శనివారం ఆయన నగరంలో కాపు, తెలగ, బలిజ హెల్పింగ్ హ్యాండ్స్ లోగోను ఆవిష్కరించిన అనంతరం సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నిరుపేదలకు ఆర్థిక సాయం అందించారు.

ముగిసిన సింహాచలం ఈఓ డిప్యుటేషన్

సింహాచలం : సింహాచలం దేవస్థానం ఈఓగా శ్రీనివాసమూర్తి డిప్యుటేషన్ ముగిసినట్టు దేవదాయ శాఖ ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి ఎస్. సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది సెప్టెంబరు 17న ఈఓగా శ్రీనివాసమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఏడాది పాటు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. ఉత్తర్వుల్లో శ్రీనివాసమూర్తిని తక్షణమే సాధారణ పరిపాలనా విభాగానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. కాగా ఆర్‌డీఓ వేణుగోపాల్ సింహాచలం దేవస్థానం నూతన ఈఓగా దాదాపు ఖరారైనట్టు దేవదాయశాఖ అధికారులు చర్చించుకుంటున్నారు.